క్లుప్తంగా

విధుల్లో చేరిన జూనియర్ అకౌంటెంట్, వార్డ్ ఆఫీసర్లు


విధుల్లో చేరిన వారితో కేఎంసీ కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో 15 మంది వార్డ్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంటెంట్ గురువారం విధుల్లో చేరారు. ఇటీవల గ్రూప్–4 పరీక్షల్లో పలువురు ప్రతిభ కనబరచి వార్డ్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంటెంట్‌లుగా ఎన్నికయ్యారు. వీరిలో 43 మంది వార్డ్ ఆఫీసర్లు, ముగ్గురు జూనియర్ అకౌంటెంట్లను ఖమ్మం కార్పొరేషన్‌కు కేటాయించారు. వీరిలో కొందరు విధుల్లో చేరడంతోపాటు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో శ్రీనిధి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెద్దిరెడ్డి ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ బూమిరెడ్డి బాబురెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ అనిల్, మధు, నాగార్జున, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా హన్మంతరావు



నేలకొండపల్లి: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా రేగూరి హన్మంతరావు నియమితులయ్యారు. తమిళనాడులో ఇటీవల జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా హన్మంతరావుకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కాగా, హన్మంతరావును డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావుతో పాటు దోసపాటి చంద్రశేఖర్, యర్రా నాగేశ్వరరావు, సర్వేశ్వరరావు, తెల్లాకుల ఆశోక్, కొత్తా రమేష్ అభినందించారు.

ట్రాక్టర్ ఢీకొనడంతో విరిగిన స్తంభం

నేలకొండపల్లి: అర్ధరాత్రి వేళ అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. మండలంలోని చెన్నారంలో బుధవారం అర్ధరాత్రి ఓ ట్రాక్టర్ అతివేగంగా వెళ్లి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ మేరకు పెద్దశబ్దం రాగా ఉలిక్కిపడిన స్థానికులు చూసేసరికి తీగలు వేలాడుతుండడంతో పాటు మంటలు వస్తున్నాయి. దీంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సరఫరా నిలిపివేశారు. ఆపై స్తంభం కింద పడిపోకుండా నిచ్చెన ఏర్పాటుచేశారు. ఇక గురువారం ఉదయం సిబ్బంది చేరుకుని స్తంభం మార్చే పనులు చేపట్టారు.

క్రీడల్లో రాణించాలి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో వార్షిక క్రీడా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. త్రివేణి– కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సీఆర్‌ఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	3
వంకాయ	40		20
బెండకాయ	50	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	54	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	68	తోటకూర	3
దొండ	54		20
పొట్లకాయ	50	గోంగూర	4
చిక్కుడు	48		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	28		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	44		25
క్యాప్సికం	68	-ఖమ్మం వ్యవసాయం	

బిల్లుల పంచాయితీ..!

అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు
- పేరుకుపోయిన రూ.లక్షల బిల్లులు
- ఉద్యమానికి సమాయత్తమవుతున్న తాజా మాజీలు


నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

నేలకొండపల్లి: ప్రతీ పంచాయతీ అన్ని సౌకర్యాలు కల్పనలో కీలక పాత్ర పోషించిన సర్పంచ్‌లు నేడు అప్పుల పాలై కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో పల్లెల అభివృద్ధికి వివిధ పథకాలను అమలు చేయడంతో చాలా పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఆయా సర్పంచ్‌లను ఒత్తిడి చేసి పనులు చేయించారు. కానీ నేడు బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాన్ని మూడు నెలల నుంచి ఒత్తిడి చేస్తున్నా పట్టించుకోవటం లేదు.

ఎస్‌టీఓల్లో మూలుగుతున్న చెక్కులు

పంచాయతీల్లో చిన్న సమస్యల పరిష్కారానికి, అత్యవసర పనులకు భారీ ఎత్తున అప్పులు తెచ్చి పెట్టారు. కాగా రెండేళ్ల క్రితం పంచాయతీలకు చెందిన చెక్కులను సబ్ ట్రెజరీ (ఎస్‌టీఓ)కి పంపించారు. కానీ ప్రభుత్వం ఫ్రీజింగ్ పేరుతో చెక్కులను అంతే పెండింగ్‌లోనే ఉంచారు. పలు పంచాయతీలకు చెందిన ఎంబీ రికార్డు చేసిన బిల్లుల చెక్కులను నిలిపివేశారు. పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనలు చేస్తే కేసులు బనాయిస్తున్నారు. వెంటనే చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దశల వారీగా ఆందోళనలకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉద్యమం మరింత తీవ్రతరం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పెరిగిపోతున్న వడ్డీలు..

పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి మండలంలోని 32, తిరుమలాయపాలెం–40, ఖమ్మం రూరల్–28, కూసుమంచి–41, ఖమ్మం నియోజకవర్గంలో రఘునాథపాలెం మండలంలో 37 పంచాయతీలున్నాయి. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణకు ముందుగా నిధులు ఖర్చు చేసి తరువాత బిల్లుల పెట్టాల్సి ఉంటుంది. వీటితో పాటు మన ఊరు–మన బడి, పల్లె ప్రగతి పనులతో పాటు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రైతు వేదికలు, పంచాయతీ భవనాల నిర్మాణాలకు కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవటంతో సర్పంచ్‌లను బెదిరించి పనులు చేయించారు. డబ్బులు అందక పనులు చేయని సర్పంచ్‌లను సస్పెండ్ చేయటం, లేదా షోకాజ్ నోటీసులు ఇవ్వటం లాంటి చర్యలకు అధికారులు పాల్పడ్డారు. తీరా బిల్లుల గురించి అడిగితే మొహం చాటేస్తున్నారని, తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలకు వడ్డీలు పెరిగిపోతున్నాయని మాజీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పంచాయతీకి రూ. 5 లక్షలు, పెద్ద పంచాయతీలకు రూ.10 నుంచి 20 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది.

ఎదురుచూస్తున్నాం..



పంచాయతీకి కోసం వెచ్చించిన పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం. ఎస్‌టీఓకు పంపిన బిల్లులు కూడ విడుదల చేయటం లేదు. దీంతో తాజా మాజీ సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– భూక్యా సుధాకర్, మంగాపురంతండా, మాజీ సర్పంచ్

అడిగితే అరెస్టులు చేస్తున్నారు



సర్పంచ్‌లు తమకు రావాల్సిన బిల్లుల కోసం ఆందోళన చేస్తే అరెస్టులు చేయటం న్యాయం కాదు. అప్పులు చేసి అభివృద్ధి చేస్తే ఇదేనా మాజీ సర్పంచ్‌లకు ఇచ్చే గౌరవం. ప్రభుత్వం ఆలోచించి...వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– గండు సతీష్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు, నేలకొండపల్లి

ప్రభుత్వ వైఖరి మారాలి



తాజా మాజీ సర్పంచ్‌లపై ప్రభుత్వ వైఖరి మారాలి. వారికి రావాల్సిన బిల్లులు అడిగితే అరెస్టులు చేయిస్తారా ఇదేనా ప్రజాస్వామ్యం. ప్రభుత్వానికి పంచాయతీలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారికి అందాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలి. లేకుంటే సర్పంచ్‌లు చేసే ఆందోళనలో పాలు పంచుకుంటాం.

– పాగర్తి సుధాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు

ఖమ్మం సమగ్రాభివృద్ధే ధ్యేయం

● మేయర్ నీరజ


చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగర సమగ్రాభివృద్ధే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్యేయమని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. గురువారం నగరంలోని పలు డివిజన్లలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ ఏ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర తిలక్, బాణాల లక్ష్మణ్, దేవత శంకర్, దానాల వెంకటరమణ, జహీర్, రఘు, భరత్, అజయ్, శ్రీను, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతోనే లక్ష్యసాధన


కలెక్టర్‌తో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

ఖమ్మంరూరల్/ఖమ్మం అర్బన్/ఖమ్మం సహకారనగర్: ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతోనే ముందుకు సాగితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ.లక్ష్మీనారాయణ తెలిపారు. రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఏర్పాటుచేసిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంతో పాటు ఖమ్మం పుట్టకోటరోడ్డులోని శ్రీ చైతన్య గ్లోబల్ విస్తా స్కూల్‌లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. విద్యతోనే ఏదైనా సాధ్యమని గుర్తించాలన్నారు. దేశాభివృద్ధిలో కీలకమైన విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని అది సాధించేందుకు వివేకానందుడు, అబ్దుల్ కలాం వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడగా కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీవిద్య, డీజీఎం చైతన్ మాధూర్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, రూరల్ మండలం రెడ్డిపల్లిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను కూడా లక్ష్మీనారాయణ కలిసి మొక్కల పెంపకం వివరాలు తెలుసుకున్నారు. అలాగే, కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను సైతం లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులే..


నివాళులర్పిస్తున్న హేమంతరావు తదితరులు

తిరుమలాయపాలెం: నిరంకుశ, నిర్బంధ పాలనకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడి వెన్నుదన్నుగా నిలిచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. గురువారం మండలంలోని తిరుమలాయపాలెంలో రావూరి బుచ్చి రామయ్య, ఆళ్ల సీతారామయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. నిరుపేద అణగారిన వర్గాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉంటూ అమరులు అనేక ఉద్యమాలు చేశారని, కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించారని వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే చట్టాలను తీసుకుని వచ్చారని విమర్శించారు. ఎర్ర జెండాతోనే పేద ప్రజలకు విముక్తి అన్నారు. అనంతరం మద్దినేని వీరభద్రం స్మారక స్థూపం వద్ద నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సీపీఐ రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, మండల కార్యదర్శి రాధాకృష్ణ సహాయ కార్యదర్శి రామకృష్ణ, వీరభద్రం, ఇంటూరి వెంకటేశ్వర్లు, చావా వెంకట్రావు, మాగం రంగయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను శరవేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సర్వేలోని అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 22న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే ఆటో అండ్ మోటార్ యూనియన్ రెండో మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్ కోరారు. గురువారం ఖమ్మం కాల్వొడ్డున మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీయూసీఐ నగర అధ్యక్షుడు ములకలపల్లి లక్ష్మీనారాయణ, నాయకులు అక్కి నాగరాజ్, గుడిసెట్టి మాధవరావు, ఎడ్లపల్లి సతీష్, నరేష్, మురళీకృష్ణ, లక్ష్మయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్యశిబిరంలో గోపాలమిత్రలు తదితరులు

తిరుమలాయపాలెం: పశు పోషణలో సరైన జాగ్రత్తలు తీసుకుని పాల ఉత్పత్తులను పెంపొందించుకోవాలని గోపాలమిత్ర సూపర్‌వైజర్ కాజా నతికుద్దిన్ అన్నారు. గురువారం మండలంలోని మేడిదపల్లిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు కృత్రిమ గర్భధారణ, చూడి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధి నివారణ, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సుబ్లేడు పశువైద్యాధికారి ఎస్‌కె.జానీ, కాకరవాయి ఎల్‌ఎస్‌ఏ అక్బర్ భాషా, గోపాల మిత్రలు నేలమర్రి నారాయణ, మట్టి వీరబాబు, నాగేంద్రయ్య తూమాటి శ్రీను, చుంచు మదర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ


స్పోర్ట్స్ దుస్తులతో విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: స్థానిక నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జమాతే ఇస్లామీ హింద్(జేఐహెచ్) ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శైలజ లక్ష్మి మాట్లాడుతూ... చదివు సమాజ అభివృద్ధికి మూలమని, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫోర్డ్ ప్రిన్సిపాల్ జాఫర్ మతీన్, జేఐహెచ్ జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా, నయాబజార్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు సుధారాణి, ఉపేందర్, ఎజాస్, స్టాఫ్ సెక్రటరీ సురేష్, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమి, ఖిల్లా, ఇంద్రనగర్, ఇస్లాంపేట అధ్యక్షుడు అబ్దుల్ మలిక్, నిజాముద్దీన్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరవలేనివి

నేలకొండపల్లి: వాసవి క్లబ్ సీనియర్ ప్రతినిధి మాటూరి సుగుణ సేవలు మరవలేనివని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దోసపాటి చంద్రశేఖర్ అన్నారు. ఇటీవల మృతి చెందిన సుగుణ కుటుంబాన్ని గురువారం పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు రేగూరి హనుమంతరావు, కొత్తా రమేష్, తెల్లాకుల ఆశోక్, గెల్లా శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో పెద్దమ్మతల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం శ్రీమహాచండీ సమేత శ్రీరుద్ర యాగం వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం హోమం పూజలతోపాటు, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ప్రతిష్ఠ, శిఖర అభిషేకం పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాల మొక్కులు చెల్లించనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

దివ్యాంగురాలికి రూ.లక్ష రుణం


చెక్కు అందజేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో మెప్మా ఆధ్వర్యంలో దివ్యాంగురాలు దుంగ్రోతు కమలకు రూ.1 లక్ష రుణం బ్యాంక్ ద్వారా మంజూరు చేయించారు. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సాయం చేయాలని కమల కలెక్టర్‌ను కోరగా అధికారులను కలెక్టర్ రుణం ఇప్పించాలని ఆదేశించారు. ఈ మేరకు నగరంలోని ఏపీజీవీబీలో చెక్‌ను మెప్మా అధికారుల ఆధ్వర్యంలో మేనేజర్ వీరయ్య చౌదరి అందజేశారు. ఏడీఎంసీ సుజాత, సీవో రోజ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నరికినందుకు రూ.10 వేల జరిమానా


నరికిన చెట్టును పరిశీలిస్తున్న రాధిక

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీతో పాటు వివిధ శాఖల ఆధ్వర్యాన విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షిస్తుండగా కొందరు తమ ఇళ్లు, షాపులకు అడ్డుగా ఉన్నాయని ఏపుగా పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని కేఎంసీ అధికారులు, సిబ్బంది విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం నగరంలోని 49వ డివిజన్‌లో ఓ ఇంటి యజమాని చెట్టు నరికివేయించగా రూ.10వేల జరిమానా విధించారు. కేఎంసీ హార్టికల్చర్ అధికారి రాధిక, శానిటరీ సూపర్‌వైజర్ భీమయ్య పాల్గొన్నారు.

కోడలి పేరిట పట్టా రద్దు చేయాలని వినతి

నేలకొండపల్లి: కుమారుడి మృతి అనంతరం కోడలి పేరిట మార్చుకున్న పట్టాను రద్దుచేయాలని మండలంలోని అమ్మగూడెంకు చెందిన ఆడపాల సాయమ్మ కలెక్టర్‌ను కోరింది. అమ్మగూడెంకు చెందిన సాయమ్మ భర్త మృతి చెందాక రెండెకరాల ను ఆమె కుమారుడు అరుణ్‌కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించింది. ఇటీవల అరుణ్ కూడా చనిపోవడంతో తనకు తెలియకుండా కోడలు ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ వయస్సులో తనను చూసే వారు లేనందున పట్టాపై పేరు మార్పించాలని కోరగా విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకిద్దాం


మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఖమ్మం మామిళ్లగూడెం: జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలని పలువురు నాయకులు అన్నారు. గురువారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు అమిత్ షా పార్లమెంట్‌లో బహిరంగంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ ప్రదర్శన జరిపి అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వునూరి మధు, స్వర్ణ అధ్యయన వేదిక వ్యవస్థాపకులు కాకి భాస్కర్ మాట్లాడుతూ... జమిలి ఎన్నికల విధానాలంతో భారత రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని, మనువాద సిద్ధాంతాన్ని ఈ దేశంలో ప్రత్యక్షంగా ప్రవేశపెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, నాయకులు జితేందర్ రెడ్డి, సింగు నరసింహారావు, చిర్ర రవి, విజయమ్మ, పోటు కళావతి, జిల్లా కార్యదర్శి వై.జానకి, న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి పాముల మోహన్ రావు, జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాన్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, వై.ప్రకాష్‌రావు, నాగరాజు, పుల్లయ్య, లింగయ్య, రంగుల శ్రీను, గంగమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాల వార్షికోత్సవం

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు హరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సకాలంలో హాజరుకావాలని కోరారు.

హద్దురాళ్లు తొలగించిన కేసులో ఆరుగురికి జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించిన స్థలంలో రాళ్లను తొలగించిన ఆరుగురికి మూడు నెలలు జైలు శిక్షతో పాటు రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలంలోని గుదిమళ్లలో సర్వే నంబర్‌లోని 159, 161లో గంజి వెంకటేశ్వర్లుకు 26ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని మిషన్ భగీరథ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఉత్తర్వులతో 2016 ఆగస్టు 31న రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. దీంతో ఆయన హద్దురాళ్లు వేయించాడు. అయితే, అదే ఏడాది సెప్టెంబర్ 6న గుదిమళ్లకే చెందిన దారా శేషయ్య, దారా నాగభూషణం, దారా యల్లయ్య, బొప్పిని శ్రీను, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి లక్ష్మయ్య ట్రాక్టర్‌తో రాళ్లను ధ్వంసం చేయడమే కాక వెంకటేశ్వర్లను దుర్భాషలాడారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు ఖమ్మం రూరల్ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం ఆరుగురికి జైలుశిక్ష, జరిమానా విధించగా కోర్టుకు గైర్హాజరైన దారా శేషయ్యపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

అమిత్ షా వ్యాఖ్యలు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తప్పుడు వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలను ప్రజాస్వామ్య వాదులు నిరసించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర పాలకులకు అంబేడ్కర్ అంటే చిన్న చూపు ఉందని, అమిత్ షా, నరేంద్ర మోదీ బేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నేలకొండపల్లి: బీఆర్.అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని డిమాండ్ చేశారు. హైద్రాబాద్‌లోని ట్యాంక్‌బండ వద్ద ఆందోళన చేస్తున్న అంజిని అరెస్ట్ చేశారు. అదే విధంగా కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, జిల్లా ఉపాధ్యాక్షుడు బోయిన వేణు, మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, కడియాల నరేష్, మాలమహానాడునాయకులు బట్టపోతుల ప్రకాషం, తెలగమళ్ల నరేష్ తదితరులు అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు.

నేటి నుంచి ధ్యానోత్సవాలు


ప్రచారంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

కూసుమంచి: మండల కేంద్రంలోని ఎస్ఆర్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం నుండి ఈనెల 22 వరకు మూడు రోజుల పాటు ధ్యానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు యోగా, ధ్యాన, శిక్షణను విజయవంతం చేయాలని గురువారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ప్రతీ రోజు సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 వరకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు నరసింహాచారి, నరేందర్, కరుణాకర్, అనురాధ, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.